క్లుప్తంగా

చిరుధాన్యాలతో రక్తహీనత నివారణ

తెనాలి టౌన్: రూరల్ మండలం గుడివాడలోని అంగన్‌వాడీ–3 కేంద్రంలో శనివారం పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ టి.రాధిక చిరుధాన్యాల గురించి మహిళలకు వివరించారు. రోజూ ఆహారంలో తీసుకోవడం వల్ల రక్తహీనత నివారణతో పాటు కొలెస్ట్రాల్, బరువు నియంత్రణలో ఉంటుందని తెలిపారు. చిరుధాన్యాల్లో పీచు పదార్థం ఎక్కువగా ఉండడం వల్ల ఆకలి ఎక్కువ వేస్తుందని, మలబద్ధకాన్ని కూడా అరికడుతుందని చెప్పారు. గర్భిణులు, బాలింతలు బలవర్థకమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.కృష్ణవేణి, కె.ఉమాదేవి, వి.శ్రీదేవి, ఎం.రాజకుమారి పాల్గొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారం గురించి వివరిస్తూ ప్రదర్శన నిర్వహించారు.

విద్యతోనే ఉన్నత శిఖరాల అధిరోహణ



తెనాలి అర్బన్: విద్యతోనే ఉన్నత శిఖరాల అధిరోహణ సాధ్యమని, ప్రతి ఒక్కరూ చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని జేఎంజే కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ థెరీసమ్మ, ప్రిన్సిపల్ సిస్టర్ షైనీ సూచించారు. కళాశాల డిగ్రీ ఆఖరి సంవత్సరం విద్యార్థినులకు శనివారం ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిస్టర్ థెరీసమ్మ మాట్లాడుతూ విద్యతో పాటు ఉన్నత విలువల్ని కూడా అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు.

విలక్షణ నటుడు ఎన్‌టీఆర్



తెనాలి అర్బన్: విలక్షణ నటుడు ఎన్‌టీ రామారావు అని వేములపల్లి మల్లికార్జునరావు, కె.వి. సుబ్రమణ్యం పేర్కొన్నారు. ఎన్‌టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఎన్‌టీఆర్ వ్యక్తిత్వంపై శనివారం సాయంత్రం కొత్తపేటలోని పెన్షనర్స్ హాలులో చర్చ నిర్వహించారు. సినీ దర్శకుడిగా ఎన్‌టీఆర్ ప్రతిభను వారు వివరించారు. అనంతరం ప్రముఖ కీబోర్డు ప్లేయర్ బనరావూరి మురళీకృష్ణతో పాటు వక్తలను సన్మానించారు. కార్యక్రమంలో శత జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, దేవరపల్లి భవాని, ఎన్‌టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, వేమూరి రాధాకృష్ణమూర్తి, వీరసుబ్రహ్మణ్యం, పుట్టా శివయ్య, మేడిద శ్యామ్‌కుమార్, కాలేషా పాల్గొన్నారు.

డిపాజిట్లపై వడ్డీ రేటు 10 శాతానికి పెంపు

జన్మదిన వేడుకల్లో 'కాకతీయ' చైర్మన్ డీఎల్ కాంతారావు ప్రకటన



తెనాలి: పోస్టల్ ఉద్యోగుల కళాపరిషత్ వ్యవస్థాపకుడు, కాకతీయ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ డీఎల్ కాంతారావు జన్మదినం సందర్భంగా ఖాతాదారుల డిపాజిట్లపై వడ్డీ రేటును 9 నుంచి 10 శాతానికి పెంచారు. బ్యాంకులో శనివారం జరిగిన జన్మదిన వేడుకల్లో చైర్మన్ డీఎల్ కాంతారావు ఈ ప్రకారం ప్రకటన చేశారు. జన్మదినం సందర్భంగా పలువురు ప్రముఖులు కాంతారావును సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, అర్బన బ్యాంక్ మాజీ చైర్మన్ మంగమూరి హరిప్రసాదరావు, రోటరీ క్లబ్ సభ్యుడు కన్నెగంటి మురళీకృష్ణ, న్యాయవాది వెలినేని రాఘవయ్య, తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కొల్లూరు సురేష్, కాకతీయ బ్యాంక్ డైరెక్టర్లు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి సీఎం జగన్

రేపల్లె రూరల్: రైతు ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రైతు పక్షపాతి అని జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డ్ మెంబర్, సర్పంచి తలశిల శ్రీనివాసరావు అన్నారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండలంలోని రాజుకాల్వ గ్రామంలో శనివారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పాడిపశువుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగనన్న అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, వాటిని పశుయజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా 112 గేదెలు, దూడలకు, 6 తెల్ల పశువులకు గాలికుంటూ వ్యాధి నివారణ టీకాలు వేశారు. అదే విధంగా పశువైద్యాధికారి 59 గేదెలను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో గోపాల మిత్రలు జి.దేవర్ధనరావు, శివకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ చీరాల రాజబాబు, సచివాలయం కన్వీనర్ మల్ల మహేష్, మాజీ నీటి సంగం ప్రెసిడెంట్ తలశిల సీతారామయ్య పాల్గొన్నారు.

ఆసరాతో మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



మహిళలకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం లభించిందని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. కుటుంబాన్ని తీర్చిదిద్దుకుంటూ బిడ్డల్ని చదివించుకుంటున్నారని చెప్పారు. పేదలతోపాటు భర్తను కోల్పోయిన వితంతువులు, ఒంటరి మహిళలకు సంక్షేమ పథకాల లబ్ధి ఎంతగానో భరోసానిస్తోందని తెలియజేశారు. మరోవైపు సంక్షేమంతో ప్రజల్లో కొనుగోలుశక్తి పెరిగిందన్నారు. దేశంలోకెల్లా రాష్ట్రంలో జీఎస్టీ ఆదాయం పెరుగుదల ఇందుకు నిదర్శనమని తెలిపారు. మూడో విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు శనివారం పట్టణ 1, 2, 3, 4, 39, 40 వార్డుల పరిధిలో అయితానగర్‌లోని పొట్టి శ్రీరాములు పార్కు వద్ద జరిగాయి. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ అయితానగర్ తన సొంత ప్రాంతమని, తన తండ్రి అన్నాబత్తుని సత్యనారాయణను ఆదరించినట్టే తననూ ఆదరించారని తెలిపారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ఎక్కడా దుర్వినియోగం చేయడం లేదని, సంక్షేమ పథకాల మంజూరులో ఎలాంటి వివక్ష చూపటం లేదని, అలాంటి క్షుద్ర రాజకీయాలు తాను చేయనని స్పష్టంగా చెప్పారు. మంచి చేసినపుడు ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ మర్చిపోరనే విశ్వాసం తనకు ఉందని పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతగా వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం వడ్డీతో సహా ఇప్పటికి రూ.25 వేల కోట్లకు చేరిన రుణమాఫీకి గానూ మూడు విడతలుగా రూ.19,134 కోట్లను ఇప్పటికి జమ చేశారని చెప్పారు.నాలుగో విడత జనవరిలో ఇవ్వనున్నట్టు తెలిపారు. నియోజకవర్గం వరకు రూ.102.34 కోట్లు రాగా, పట్టణ పరిధిలో రూ.40 కోట్లను ఇచ్చినట్టు తెలిపారు. ఆసరాకు తోడుగా అమ్మ ఒడి, చేయూత, ఈబీసీ నేస్తం, విద్యాదీవెన వంటి సాయాలు ఇస్తూ పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యా బోధనను ప్రభుత్వం అందిస్తోందని వివరించారు. సంక్షేమ పథకాలతో పేదలను ఆదుకుంటుంటే, బటన్ నొక్కుతూ పేదలకు దోచిపెడుతున్నారని కొందరు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న విషయాన్ని ఎమ్మెల్యే శివకుమార్ సభాముఖంగా గుర్తుచేశారు. ఇచ్చిన హామీలు నిలుపుకుంటూ సంక్షేమంతో ఆదుకుంటున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని, తనను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం 1, 2, 3, 4, 39,40 వార్డుల్లోని 2338 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.1.73 కోట్ల చెక్కును ఎమ్మెల్యే శివకుమార్ అందజేశారు. కౌన్సిలర్లు అన్నాబత్తుని పద్మజ, గెడ్డేటి ఝాన్సీవాణి, అత్తోట నాగవేణి, ఆవుల కోటయ్య, పార్టీ నేతలు కాకి దేవసహాయం, వేజండ్ల శ్రీకాంత్, కృష్ణ బలిజ, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ కావేటి నిర్మల, అరుణ 'మెప్మా' మాధవరావు స్వాగతం పలికారు.

వైభవంగా సత్యనారాయణస్వామి వ్రతాలు



అప్పలస్వామి గుడిలో పూజలు చేస్తున్న దంపతులు



సత్యనారాయణస్వామి వ్రతంలో పూజలు చేస్తున్న ఈవో మల్లీశ్వరి



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ సంజీవరెడ్డి

తెనాలి టౌన్: పట్టణంలోని పలు ఆలయాల్లో వసంత నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మారీసుపేటలోని శ్రీ కోదండరామస్వామి దేవస్థానం(అప్పలస్వామి గుడి)లో ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం సహస్రనామ పూజలు నిర్వహించారు. శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు. అనంతరం హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ చేశారు. ధర్మకర్త కూనపల్లి నారాయణస్వామి, దేవాలయ సమన్వయకర్త వి.ఆంజనేయ శాస్త్రి, మేనేజింగ్ ట్రస్టీలంక శివానందకుమార్, జనరల్ సెక్రటరీ ఆంజనేయ ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

■ రామస్వామిపేటలోని శ్రీ పట్టాభిరామాలయంలో ఉత్సవాలు సత్యనారాయణస్వామి వ్రతంతో ముగిశాయి. పట్టాభిషేకం, వ్రతాన్ని ప్రధాన అర్చకులు సుందరాచారి, మారుతి నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానాన్ని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి ప్రారంభించారు. సుమారు నాలుగు వేల మందికి అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమాన్ని ఈవో మల్లీశ్వరి పర్యవేక్షించారు.

■ బాలాజీరావుపేటలోని కోదండరామస్వామి ఆలయంలో త్రయాహ్నిక దీక్షలో సాగిన శ్రీరామనవమి ఉత్సవాలు శనివారం పూర్ణాహుతితో ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకుడు రావూరి సత్యజ్ఞానమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పూజల్ని కందిమళ్ల వెంకట రమేష్‌బాబు దంపతులు జరిపారు. పూర్ణాహుతి అనంతరం 300మందికి అన్నదానం చేశారు. కార్యక్రమాన్ని ఈవో మల్లీశ్వరి పర్యవేక్షించారు.



పూజల్లో పాల్గొని హారతి తీసుకుంటున్న ఎమ్మెల్యే శివకుమార్

పది పరీక్షలకు పగడ్బందీ ఏర్పాట్లు



వేమూరులో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండల విద్యాశాఖాధికారి లక్ష్మీనారాయణ

వేమూరు: పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యా శాఖాధికారి కాజా లక్ష్మీనారాయణ తెలిపారు. వేమూరు ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో 2,074 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

రేపటి నుంచి పదో తరగతి పరీక్షలు

కర్లపాలెం: పదో తరగతి పరీక్షలు సోమవారం ఉదయం నుంచి ప్రారంభం కానున్నాయని ఎంఈఓ టీయామనోరంజని శనివారం తెలిపారు. ఏర్పాట్లు పూర్తయ్యాయని మండల పరిధిలోని యాజలి, ఎంపీ రాజుపాలెం, చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

12 నుంచి బాలికలకు ఉచిత క్రికెట్ కోచింగ్ క్యాంపు

తెనాలి అర్బన్: తెనాలి యంగ్ క్రికెటర్స్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి బాలికలకు ఉచిత క్రికెట్ కోచింగ్ క్యాంపును నిర్వహించనున్నట్లు ఎస్.సువర్ణరాజు శనివారం ఒకప్రకటనలో తెలిపారు. 15సంవత్సరాలు నిండిన బాలికలకు సీనియర్ కోచ్ డి.వి.పి.జాన్సన్ పర్యవేక్షణలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న బాలికలు 77807 95880లో సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

రేపు తెనాలిలో జంతువధ నిషేధం

తెనాలి అర్బన్: మహావీర్ జయంతిని పురస్కరించుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం తెనాలి పట్టణంలో జంతువధను నిషేధిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అన్ని మాంసపు దుకాణాల్లో విక్రయాలను నిలిపివేయాలని సూచించారు. అన్ని హోటళ్లలో మాంసం అమ్మకాలు ఉండరాదని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు పాటించని వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భారతదేశం విజ్ఞాన శాస్త్రానికి పుట్టినిల్లు

కేంద్ర రక్షణ మంత్రి శాస్త్ర సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి



పుస్తకావిష్కరణ చేస్తున్న డాక్టర్ సతీష్‌రెడ్డి, కేఎల్‌యూ రిజిస్ట్రార్ సుబ్బారావు తదితరులు

తాడేపల్లి రూరల్: భారతదేశం విజ్ఞాన శాస్త్రానికి పుట్టినిల్లు అని కేంద్ర రక్షణ మంత్రి శాస్త్ర సహాదారులు డాక్టర్ సతీష్‌రెడ్డి అన్నారు. శనివారం వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో స్వాతంత్ర్య సమరంలో విజ్ఞాన శాస్త్రం పుస్తక ఆవిష్కరణ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి సతీష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం అలవరుచుకోవాలన్నారు. విజ్ఞాన శాస్త్ర ఆవశ్యకతను అవగతం చేసుకోవాలని చెప్పారు. ఆర్యభట్ట, చరకుడు, సుశ్రుతుడు వంటి మహా శాస్త్రవేత్తలు పూర్వకాలంలోనే భారతదేశంలో విజ్ఞాన శాస్త్రంలో పలు ఆవిష్కరణలు చేశారని గుర్తుచేశారు. మన దేశానికి స్వాతంత్ర్యం రాకముందే జగదీష్ చంద్రబోస్, సర్ సీవీ రామన్, ప్రఫుల్ల చంద్రరే, మహేంద్రాలాల్ వంటి వారు సమాజానికి విజ్ఞాన ఫలాల్ని అందించారని వివరించారు. అనంతరం స్వాతంత్ర్య సమరంలో భారత శాస్త్రవేత్తలు పుస్తకాన్ని ఆవిష్కరించి, రచయిత జయంత్ సహస్ర బుద్దేను అభినందించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం, స్కూల్ ఆఫ్ ప్లానింగ్, ఆర్కిటెక్చర్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ శ్రీకొండ, విజ్ఞాన భారతి ఆంధ్రప్రదేశ్ అధ్యాపకులు డాక్టర్ పి.ఎస్.అవధాని తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

రేపల్లె రూరల్: మండలంలోని గంగడిపాలెం పంచాయతీ జొన్నవారిపాలెం స్కూల్ గ్రౌండ్స్‌లో మోపిదేవి రాజీవ్ యువసేన ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న గుంటూరు– కృష్ణా జిల్లాల స్థాయి కబడ్డీ పోటీలు శనివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. పోటీలను చోడాయపాలెం ఎస్‌ఐ శివప్రసాద్ ప్రారంభించారు. పోటీల నిర్వాహకుడు, గంగడిపాలెం సర్పంచి తిరుమలశెట్టి శివాజీ మాట్లాడుతూ పోటీలకు వివిధ జిల్లాల నుంచి 16 జట్లు హాజరయ్యాయన్నారు. చివరి రోజు ఆదివారం విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రాజుకాల్వ సర్పంచి తలశిల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ముగిసిన ఫిల్మ్ ఫెస్టివల్



కేఎల్‌యూ విద్యార్థులు రూపొందించిన మాహిష్మతి సామ్రాజ్య నమూనా

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఫిల్మ్ ఫెస్టివల్ వేడుకలు శనివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి సీఈఓ దేవీ ప్రసాద్ బలివాడ ముఖ్య అతిథిగా విచ్చేశారు. లలిత కళల విభాగ అధిపతి సుభాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫిల్మ్ ఫెస్టివల్ ఆహూతుల్ని ఎంతగానో ఆకట్టుకుంది. విజువల్ కమ్యూనికేషన్ విద్యార్థులు తీసిన ఫొటోలతో కూడిన ఫొటో బుక్‌ను ఎంహెచ్‌ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిశోర్‌బాబు ఆవిష్కరించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఫిరంగిపురం: మండలంలోని అల్లంవారిపాలెం గ్రామంలోని చెరువుకట్ట వద్ద హోసన్న మందిర్ సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ మేడా బాబు శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కొమ్మారెడ్డి చిన్నప్పరెడ్డి, కె.లింగారావు, వార్డు మెంబర్ సుబ్బారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో ప్రముఖుల విగ్రహాల ప్రతిష్ట

భట్టిప్రోలు: భట్టిప్రోలు బౌద్ధ స్తూపం సమీపంలో వివేకానంద విగ్రహ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ప్రముఖుల విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం శనివారం నిర్వహించారు. సుప్రసిద్ధ గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు, సుభాష్ చంద్రబోస్, స్వామి వివేకానంద, అల్లూరి సీతారామరాజు, శ్రీ కృష్ణదేవరాయలు విగ్రహాలను నెలకొల్పారు. ప్రముఖ వాస్తు శిల్పి వంగర చలమయ్య సిద్ధాంతి ఈ సందర్భంగా మంత్రోచ్చరణ నిర్వహించారు. బందారు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బొలిశెట్టి శ్రీనివాసరావు, కె.చిదంబరం, నాగ రమేష్, తిరువీధుల వెంకటేశ్వర్లు, మూర్తి, చందలూరి రామకోటేశ్వరరావు, సీహెచ్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా వార్షిక బ్రహ్మోత్సవాలు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరంలో వేంచేసి ఉన్న శ్రీమద్వీంరాంజనేయ సమేత కోదండరామస్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి భ్రమరాంబ పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలు అందజేశారు.

రైతుల భూమి సమస్యల పరిష్కారానికే రీసర్వే



కఠెవరం గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరావు

తెనాలి టౌన్: రైతుల భూమి సమస్యల్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం సమగ్ర రీసర్వే చేస్తున్నట్లు ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు తెలిపారు. రూరల్ మండలం కఠెవరంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం సమగ్ర రీసర్వేపై గ్రామ సభను నిర్వహించారు. సభకు తహసీల్దార్ కె.రవిబాబు అధ్యక్షత వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని రైతుల భూమి సమస్యల్ని రీసర్వేతో తీర్చుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని రైతులు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతిగా పనిచేస్తున్నారని తెలిపారు. రీసర్వే వల్ల రైతులకు ఎంతో మేలు కలుగుతుందని తెలిపారు. తహసీల్దార్ కె.రవిబాబు మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వం వందేళ్ల కిందట పొలాల సర్వే చేసిందని, మళ్లీ ప్రభుత్వం ఇప్పుడు చేపట్టినట్లు తెలిపారు. 10శాతం రైతులకు సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. సభలో గ్రామ సర్పంచ్ బండికళ్ల ప్రసాద్, ఉప సర్పంచ్ మంచాల వెంకట సురేష్, వీఆర్వోలు సాల్మన్ రాజు, కిశోర్, పంచాయతీ కార్యదర్శి షేక్ గౌస్ మొహిద్దీన్, పంచాయతీ మెంబర్లు కొత్తపల్లి సుదర్శన్, షేక్ బాబూ సాహెబ్, ముక్కాల మహేష్, వైఎస్సార్ సీపీ నాయకులు మంచాల శ్రీనివాస్, చిన్ని, గంపల శివనాగేశ్వరరావు, తమ్మా శివారెడ్డి, షేక్ ఆదం షఫీ, రైతులు పాల్గొన్నారు.

పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు ఉమాప్రణతి

తెనాలి టౌన్: పదో తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి ఫలితాలు సాధించాలని జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి సూచించారు. రూరల్ మండలం కొలకలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆమె సందర్శించారు. పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు హాల్ టికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉమాప్రణతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నమ్మకాన్ని వమ్ము చేయవద్దని తెలిపారు. పరీక్షల్లో 500పైబడి మార్కులు సాధించిన విద్యార్థులకు మంచి బహుమతులు అందజేస్తామని తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పినపాటి అనిల్‌కుమార్ తెలిపారు. స్కూలుకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. తొలుతగా విద్యార్థులతో కలసి జెడ్పీటీసీ ఉమాప్రణతి, చైర్మన్ అనిల్‌కుమార్ భోజనం చేశారు. ఉపాధ్యాయులు అన్నారావు, లక్ష్మయ్య, మారుతీ కిరణ్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి సమన్వయంతో పని చేయాలి

జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాద్



భట్టిప్రోలు లే-అవుట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాద్

భట్టిప్రోలు: పేదలంతా గృహాలు నిర్మించుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బృహత్తరమైన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని బాపట్ల జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జేవీఎస్ఆర్‌కేవీ ప్రసాద్ అన్నారు. భట్టిప్రోలు లే–అవుట్‌లో శనివారం హౌసింగ్ డే పురస్కరించుకుని గృహ నిర్మాణ లబ్ధిదారులతో జిల్లాస్థాయి అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాపట్ల జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు, వేమూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి డాక్టర్ బొంతా అర్జునరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ గృహ నిర్మాణ పథకం పేదల పాలిట వరమని పేర్కొన్నారు. వలంటీర్ల దగ్గర నుంచి మండల స్థాయి అధికారుల వరకు ప్రతి ఒక్కరూ లే–అవుట్లలో నిర్మాణాలకు తమకు సంబంధం లేదనకుండా పని చేసినప్పుడే నూరు శాతం లక్ష్యాలను చేరుకోగలమని పేర్కొన్నారు. ఇప్పటి వరకు లే అవుట్లలో తాగునీరు, విద్యుత్ సమస్యలు పరిష్కరించినట్లు చెప్పారు. ఇళ్ల నిర్మాణానికి ఇబ్బందులు చెప్పాలని లబ్ధిదారులను కోరారు. తాగునీటి పైపులు ధ్వంసమైనా పట్టించుకోవడం లేదని అధికారుల దృష్టికి తీసుకు రాగా పైప్‌లైన్ల మరమ్మతులకు చర్యలు తీసుకునేలా సర్పంచి దారా రవి కిరణ్మయి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకృష్ణలతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. సమావేశానికి జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ అనివార్య కారణాల వల్ల రాలేక పోయారని తెలిపారు. ప్రస్తుతం గృహాలు నిర్మించుకునేందుకు 70 మంది ముందుకు రాగా మరో వారం పదిరోజుల్లో జిల్లా కలెక్టర్ ఈ లే–అవుట్‌ను సందర్శించే నాటికి 100 మంది గృహాలు నిర్మించుకునేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు. లే–అవుట్లలో మెరక తోలేందుకు కూడా సన్నాహాలు జరుగుతున్నాయని వివరించారు. సమావేశంలో ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, ట్రాన్స్‌కో ఏడీఏ ఎస్.భాస్కరరావు, సర్పంచి దారా రవికిరణ్మయి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, ఎంపీటీసీ సభ్యురాలు కొతరపు పద్మావతి, హౌసింగ్ డీఈ రవి కుమార్, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, ట్రాన్స్‌కో ఏఈలు శేతు రామచంద్రరావు, శివకృష్ణ, రావూరి సౌమ్య, ఏడుకొండలు, భట్టిప్రోలు, వేమూరు మండల సమాఖ్య ఏపీఎంలు గుడిమెట్ల శ్రీమన్నారాయణ, కొండూరు శోభన్, పంచాయతీ కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

వేమూరులో..

వేమూరు: జగనన్న కాలనీ లబ్ధిదారులందరు ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ సునీత పేర్కొన్నారు. వేమూరు మండల కేంద్రంలోని జగనన్న లేఅవుట్‌లో లబ్ధిదారులతో సమావేశం శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడతూ జగనన్న కాలనీల్లో ప్రభుత్వం అన్ని మౌలిక సదుపాయాలు కల్పించినట్లు పేర్కొన్నారు.

విజయకీలాద్రిపై వార్షిక వేడుకలు



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేదపాఠశాల విద్యార్థి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై అష్టలక్ష్ములను ప్రతిష్ఠించి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళా శాసనములతో త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు తిరుమంజన సేవ, అలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. 10 గంటల నుంచి సహస్ర నామార్చన, కుంకుమార్చన, ప్రసాద నివేద కార్యక్రమాలు నిర్వహించి అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం 6.30 గంటలకు తిరువీధి సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారని జీయర్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో వేదపాఠశాల విద్యార్థులు, విజయకీలాద్రి అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో పన్నుల వసూలు

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థలో ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31వ తేదీ నాటికి 85శాతం పన్నులు వసూలు చేసినట్లు నగర కమిషనర్ యు. శారదాదేవి చెప్పారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మంగళగిరి–తాడేపల్లి పట్టణాలతో పాటు 21 గ్రామాల విలీనంతో ఏర్పడిన నగరపాలక సంస్థ తొలి ఏడాదిలోనే 85 శాతం పన్నులు వసూలు చేయడం శుభపరిణామన్నారు. పన్నులను సకాలంలో చెల్లించి నగర అభివృద్ధికి సహకరిస్తున్న నగర వాసులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. పన్నుల వసూలులో నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారులు, సిబ్బందితోపాటు సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది నిరంతరం కృషి చేశారని, వారిని అభినందిస్తున్నట్లు తెలిపారు. పన్ను బకాయిలపై ఇచ్చిన వడ్డీ రాయితీలను సద్వినియోగం చేసుకుని నగర అభివృద్ధిలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.